క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశత నామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అప్పన్న సన్నిధిలో మేడ్చల్ ఎమ్మెల్యే



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ కళాకారిణులు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సింహపురి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్‌కు చెందిన కళాకారిణులు తమ నృత్యాలతో అలరించారు.

గణపతి నిమజ్జనాలకు సమగ్ర ఏర్పాట్లు



నిమజ్జనానికి అనుమతి ఇచ్చిన చెరువు వద్ద ఏర్పాట్లు సమీక్షిస్తున్న పోలీసులు

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గణపతి నిమజ్జనాలకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. భక్తుల కోసం పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తున్నామన్నారు. బుధ, గురువారాల్లో నిమజ్జనాల కోసం కేటాయించిన పినగాడి వెల్ఫేర్ కళాశాల వద్ద ఉన్న పెంటవాని చెరువు, పెందుర్తి పాతూరు సమీపంలోని పెద్ద చెరువు, సరిపల్లి చిన్న చెరువు, కోటనరవ ఆవు చెరువుల వద్ద ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. ఊరేగింపుల్లో రికార్డింగ్ డాన్స్‌లు, ఇతర అశ్లీల నృత్యాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు మూడు రోజుల అంతరాయం

పరవాడ: విద్యుత్ సబ్‌స్టేషన్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ల ఆధునికీకరణలో భాగంగా భాగంగా ఈ నెల 29 నుంచి 31 వరకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కొంకోట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా కొప్పాక, పరవాడ, పోలిరెడ్డిపాలెం, పెదముషిడివాడ, పాటిపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఓ బొజ్జ గణపయ్యా.. నీ బంటు నేనయ్యా

ఊరూ, వాడా కొలువుదీరిన గణపయ్య

వాడవాడలా విఘ్నాధిపతికి పూజలు



రాంపురంలో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దంపతులు



అడవివరంలోని బాలభక్తసమాజం ఏర్పాటుచేసిన వినాయకుడిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి అప్పలస్వామి, కర్రి సత్తిబాబు




ఫ్రెండ్స్ యూత్ ఏర్పాటు చేసిన గణపతిని దర్శించుకుంటున్న మేయర్ పీలా శ్రీనివాసరావు



పెందుర్తి రైతుబజార్‌లో కొలువుదీరిన గణపతి




పెందుర్తి మండలం కోట్నివానిపాలెంలో కొలువుదీరిన వినాయకుడు



అడవివరంలోని శిడగంవీధిలో కాళీయ మర్దనుడిగా గణపతి



ప్రియాగార్డెన్స్‌లో బంగారుతల్లి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో..



సింహపురికాలనీలో అయోధ్య బాలరాముడిగా గణపతి



సింహాచలం దేవస్థాన వేద పాఠశాలలో మట్టి గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న వేద విద్యార్థులు



పరవాడ బొంగులదిబ్బ వద్ద నిలిపిన బొజ్జగణపయ్యను దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు, భక్తులు



వెన్నలపాలెంలో గణపతికి పూజలు జరిపిన భక్తులు



అడవివరం ఆయిల్‌మిల్ వద్ద గణనాథుడికి పూజలు చేస్తున్న గంట్ల శ్రీనుబాబు



గణేష్‌కాలనీలో గణనాథుడి పూజల్లో కాలనీ అసోసియేషన్ నాయకులు, నివాసితులు



వాడచీపురుపల్లిలో గణేశుడిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు, భక్తులు



మొగలిపురంలో స్వామిని దర్శించుకుంటున్న గండి రవికుమార్ తదితరులు

పెందుర్తి:

విఘ్నాధిపతి గణనాథుడు మండపాల్లో కొలువుదీరాడు. తొలిపూజలు అందుకునేందుకు దివి నుంచి భువికి దిగివచ్చాడు. వినాయక చవితి సందర్భంగా బుధవారం నియోజకవర్గంలో ఊరూరా, వాడవాడలా గణపతి పూజ ఘనంగా జరిగింది. పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల్లో భక్తజనం ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోయింది. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. వివిధ రూపాల్లో కొలువైన గణేశుడు భక్తుల పూజలందుకుంటున్నాడు.

- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని పలు మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపారు. పెందుర్తి పట్టణం, చినముషిడివాడ, సుజాతనగర్, వేపగుంట, నాయుడుతోట, గొరపల్లి, పినగాడి, కోట్నివానిపాలెం, సరిపల్లి, జంగాలపాలెం, ముదపాక, ఎస్ఆర్ పురం, జుత్తాడ, రాజయ్యపేట, రాంపురం, పెదగాడి, చింతగట్ల, జెర్రిపోతులపాలెం, గుర్రంపాలెం ప్రాంతాల్లో గణపతికి పూజలు చేశారు.

సింహాచలం: 98వ వార్డు అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 41వ సారి చవితి ఉత్సవాలను నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు గణపతి తొలి పూజలో పాల్గొన్నారు.

- శిడగం వీధిలో శ్రీనివాస యూత్ ఫ్రెండ్స్ కాళీయ మర్దనుడి ఆకారంలో ఏర్పాటు చేసిన గణనాథుడు విశేషంగా ఆకట్టుకున్నాడు.
- ప్రియాగార్డెన్స్‌లో బంగారమ్మతల్లి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గణనాథుడిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.
- సింహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి ఆకృతిలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం భక్తులను, కాలనీవాసులను విశేషంగా ఆకర్షించింది.
- అడవివరం మార్కెట్‌కూడలిలో బాలభక్తి సమాజం ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి సత్తిబాబు దర్శించుకుని, పూజలు జరిపారు.
- గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం, సింహపురి లేఅవుట్, అప్పన్నపాలెం, షిప్‌యార్డ్ లేఅవుట్, పద్మావతినగర్, టీవీ టవర్‌కాలనీ, ప్రియా గార్డెన్స్, తదితర ప్రాంతాల్లో వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.
- 98వ వార్డు పరిధి గణేష్‌కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకచవితిని విశేషంగా నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు దేవరాపల్లి సత్యనారాయణ, సూరిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, బాలాజీనగర్, గొల్లనారాయణపురం, విరాట్‌నగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేసి, గణనాథుల విగ్రహాలను కొలువుదీర్చారు.

పరవాడ: మండలంలోని పరవాడ బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పైల శ్రీనివాసరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చుక్క రామునాయుడు, నాయకులు పైల హరీష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

- వెన్నలపాలెం గ్రామంలో మరిడిమాంబ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయకుడికి భక్తులు పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.
- వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన గణపతికి పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులు ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కూండ్రపు అప్పారావు, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానం వేద పాఠశాలలో..

సింహాచలం: వినాయకచవితిని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పాఠశాలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో మట్టిగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వినాయక వ్రతకథను వేదవిద్యార్థులంతా భక్తిశ్రద్ధలతో ఆచరించారు. విశేషంగా హారతులిచ్చారు. ఉండ్రాళ్ల నైవేద్యాన్ని గణేశుడికి సమర్పించారు. వేదాలతో స్వామిని కీర్తించారు. సింహగిరి మొదటి ఘాట్‌రోడ్డు ప్రవేశం వద్ద దేవస్థానానికి చెందిన గణపతి ఆలయంలో వినాయకచవితిని ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు, మహిళలు, భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

సబ్బవరం: మండలంలో పలు చోట్ల మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన వెంట యర్ల నాయుడు, సిరపరపు వాసు తదితరులు ఉన్నారు.

- ఆదిరెడ్డిపాలెం రామాలయంలో ప్రతిష్ఠించిన సిద్ధి వినాయకుడికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటాన రాము తదితరులు పూజలు నిర్వహించి, స్వామివారి ప్రసాదం స్వీకరించారు.
- అసకపల్లి శివాలయంలో ప్రతిష్ఠించిన గణేశుడికి మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, కాపుశెట్టి నీలవేణి తదితరులు పాల్గొన్నారు.
- మొగలిపురంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ గండి బాబ్జీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కూటమి నేతలు, అభిమానులు పాల్గొన్నారు.



అదిరెడ్డిపాలెంలో పూజలు నిర్వహిస్తున్న కొటాన రాము తదితరులు



అసకపల్లి శివాలయం వద్ద అన్నసమారాధనలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



మొగలిపురంలో పార్టీ నేతలు, గ్రామ పెద్దలతో కలిసి స్వామిని దర్శించుకుంటున్న గండి బాబ్జీ తదితరులు

రామాలయానికి తాళం వేసిన టీడీపీ నేతలు



రామాలయానికి వేసిన తాళాలను చూపుతున్న సర్పంచ్ అప్పారావు

పరవాడ: కూటమి నేతలు గ్రామాల్లో అరాచకాలను కొనసాగిస్తున్నారు. అందుకు అనకాపల్లి జిల్లా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వగ్రామమైన వెన్నలపాలెం వేదికగా మారడం గమనార్హం. వినాయక చవితి వేడుకలు సందర్భంగా గ్రామంలోని రామాలయానికి కూటమి నాయకులు తాళాలు వేయడం వివాదానికి దారితీసింది. రామాలయంలో వినాయకుడిని నిలిపి సర్పంచ్ తొలిపూజ చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ సర్పంచ్ వెన్నల అప్పారావు తొలి పూజ చేసేందుకు భక్తులతో కలిసి బుధవారం ఉదయం 6 గంటలకు రామాలయానికి రాగా, అప్పటికే టీడీపీ నాయకులు ఆలయానికి తాళాలు వేసి వెళ్లడంతో అంతా అవాక్కయ్యారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావుతో రామాలయాన్ని వెంటనే తెరిపించాలని వాగ్వాదానికి దిగారు. టీడీపీ నాయకులకు పోలీసులు వంత పాడడంతో వారి అరాచకాలు, దాడులకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందని సర్పంచ్ అప్పారావు ఆరోపించారు. ఎట్టకేలకు సీఐ మల్లికార్జునరావు కల్పించుకుని తాళాలు తెరిపించి, సర్పంచ్ అప్పారావు దంపతులతో తొలిపూజలు జరిపించడంతో ఘర్షణ సద్దుమణిగింది.

'చంద్రబాబు పాపానికి పాతికేళ్లు'

- బషీరాబాద్ దమనకాండ చంద్రబాబు క్రూరత్వానికి నిదర్శనం
- ముగ్గురు వామపక్ష కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నారు
- విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినంలో సీపీఎం ధ్వజం



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న వారిని చంద్రబాబు ప్రభుత్వం కర్కశంగా పొట్టనపెట్టుకున్న పాపానికి పాతికేళ్లు నిండాయని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ ఆక్షేపించారు. ప్రపంచ బ్యాంక్ షరతులకు లొంగి ఆనాడు తీసుకున్న విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించిన వారిని పోలీసులతో మట్టుబెట్టించిన తీరు ఆయన క్రూరత్వానికి నిదర్శనమన్నారు. బషీరాబాగ్ దమనకాండకు పాతికేళ్లు నిండిన సందర్భంగా గురువారం సుజాతనగర్‌లో విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. నాడు చంద్రబాబు ప్రభుత్వం జరిపిన పోలీస్ కాల్పుల్లో మరణించిన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామిలకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నేటికీ కూటమి ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ ఆదేశిత సంస్కరణలనే అమలు చేస్తోందని ఆరోపించారు. అందుకే విద్యుత్ రంగాన్ని అదానీ చేతుల్లో పెట్టి ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధమైందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలో ఉండి కార్పొరేట్లకు సంపద పోగేసేందుకే ప్రయత్నం చేస్తున్నాయి తప్ప, సామాన్య ప్రజలకు మేలు చేయాలన్న తలంపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి, వామపక్షాలు చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ సభ్యులు బి.వెంకట్రావు, కె.అప్పలనాయుడు, ప్రభుదేవా, జగన్నాథస్వామి, లక్ష్మణరావు, మహేష్, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఛలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది

సబ్బవరం: పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలనే నినాదంతో ఏపీసీపీఎస్‌ఈఏ వచ్చే నెల 1న తలపెట్టిన ఛలో విజయవాడను జయప్రదం చేయాలని రావలమ్మపాలెం జెడ్పీహైస్కూల్ టీచర్లు పిలుపునిచ్చారు. పాఠశాలలో గురువారం సచివాలయ సిబ్బందితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. హెచ్ఎం భారతి, మండల సీపీఎస్ బాధ్యులు వనం భాస్కర్, డెక్క శ్రీను పాల్గొన్నారు.

నేడు రైతు బజార్‌లో అన్నసమారాధన

పెందుర్తి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా స్థానిక రైతుబజార్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఈవో పద్మావతి శర్మిల తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు గణపతి అన్నప్రసాద వితరణ ప్రారంభమవుతుందని, భక్తులంతా వచ్చి ప్రసాదం స్వీకరించాల్సిందిగా కోరారు.

ఆటో కార్మికుల పొట్ట కొడుతున్న ప్రభుత్వం



పరవాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు



పెందుర్తి కూడలి వద్ద ఆటోలు నిలిపి ఆందోళనకు దిగిన ఆటో కార్మికులు

- బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కారణంగా ఉపాధి కోల్పోయాం
- ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేకపోవడం దారుణం
- పెందుర్తిలో వందలాది ఆటోలు నిలిపేసి కార్మికుల నిరసన



ఊటగెడ్డకూడలిలో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

పెందుర్తి: 'ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు మేం వ్యతిరేకం కాదు. కానీ పథకాలు ప్రకటించినప్పుడు.. వాటిని అమలు చేసినప్పుడు ఆ ప్రభావం మరో రంగంపై పడకుండా చూసుకోవాలి. ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తుంది. దీనివలన ఎందరో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది.' అంటూ పెందుర్తిలో వందలాది మంది ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఆటో స్టాండ్‌ల సభ్యులంతా ఎక్కడికక్కడ ఆటోలను నిలిపేసి ప్రభుత్వంపై తమ అసంతృప్తిని వెల్లగక్కారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వం తమ కుటుంబాలను రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్ ప్రయాణం అమలు చేసే ముందు రాష్ట్రంలో ఉన్న లక్షలాది ఆటో కార్మికుల కుటుంబాల గురించి ఆలోచించకుండా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. తక్షణమే తమ జీవితాలకు భరోసా ఇవ్వకపోతే.. అతిత్వరలోనే తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని ప్రకటించారు. యూనియన్ల సంఘాల నాయకులు, ఆటోకార్మికులు ఉద్యమ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. పెందుర్తి, చినముషిడివాడ, వేపగుంట, సుజాతనగర్, పురుషోత్తపురం, పినగాడి ప్రాంతాల ఆటో యూనియన్లు ఈ చర్చల్లో పాల్గొన్నాయి.

పరవాడ: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉచిత బస్సు పథకం నేపథ్యంలో తమ ఉపాధికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ లంకెలపాలెం, పరవాడ తహసీల్దార్ కార్యాలయం, ఊటగెడ్డ కూడలి, వాడచీపురుపల్లి గ్రామాల్లోని ఆటో కార్మికులు గురువారం ఆందోళనలకు దిగారు. లంకెలపాలెం కూడలిలో చేపట్టిన రాస్తారోకోలో సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొని కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.25 వేలు మంజూరు చేయాలన్నారు. బీమా ప్రీమియం తగ్గించి ఆటో కొనుగోలుకు రూ.4 లక్షల వడ్డీలేని రాయితీ రుణాలను అందించాలన్నారు. మండల కేంద్రాల్లో ఆటో స్టాండ్ల కోసం స్థలాలను కేటాయించాలన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై తహసీల్దార్ బి.నాగరాజుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయ కులు రమణ, గోపి, రవి, వాడచీపురుపల్లి, దీపాంజలినగర్, పరవాడ, లంకెలపాలెం, ఊటగెడ్డ ప్రాంతాలకు చెందిన ఆటో కార్మికులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

'మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

పరవాడ: మహిళా చట్టాలపై పూర్తి అవగాహన పొందేందుకు విద్యార్థినులు ముందుకు రావాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత నెల 29న విద్యార్థినిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై స్పందిస్తూ గురువారం కళాశాలను సందర్శించి బాధిత విద్యార్థినిని పరామర్శించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళా శిశు సంక్షేమం ద్వారా అందిస్తున్న సేవలు, ఆడ పిల్లలు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొంటున్న భద్రత చర్యలను వివరించారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ మాట్లాడుతూ ఆడ పిల్లలు, మహిళల కోసం విశేష సేవలను అందించడానికి 181, 100, 101, 1098, 1930 హెల్ప్‌లైన్ల ప్రాముఖ్యతను తెలిపారు. మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ మాట్లాడుతూ ఆడ పిల్లలు ధైర్యంగా, ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అనకాపల్లి ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి, సబ్బవరం సీడీపీవో లలితకుమారి, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు, తహసీల్దార్ బి.నాగరాజు పాల్గొన్నారు.